ప్రభుత్వ పథకాల కరపత్రాలను పంపిణీ చేస్తున్న డిప్యూటీ సిఎం రాజన్నదొర

ఉత్సాహంగా విద్యార్థి సంగ్రామ సైకిల్‌యాత్ర

- పోరాటాల ద్వారానే సమస్యలు పరిష్కారం
- సైకిల్‌యాత్ర ప్రారంభంలో ఎమ్మెల్సీ వెంకటేశ్వరరావు
- ఎన్‌ఇపిని రద్దు చేయాలి : ఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర కార్యదర్శి అశోక్

సైకిల్‌యాత్రలో పాల్గొన్న ఎమ్మెల్సీ వెంకటేశ్వరరావు, ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు, విద్యార్థులు

ప్రజాశక్తి-కొత్తవలస

జిల్లాలో విద్యారంగ సమస్యల పరిష్కారానికి ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు చేపట్టిన 'విద్యార్థి సంగ్రామ సైకిల్‌యాత్ర' సోమవారం కొత్తవలసలో ఉత్సాహంగా ప్రారంభమైంది. ఉభయ గోదావరి జిల్లాల ఎమ్మెల్సీ ఐ.వెంకటేశ్వరరావు జెండా ఊపి ఈ సైకిల్‌యాత్రను రెవెన్యూ కార్యాలయం జంక్షన్ వద్ద ప్రారంభించారు. అక్కడి నుంచి అంబేద్కర్ జంక్షన్ వరకు సైకిల్‌యాత్ర సాగింది. ఈ సందర్భంగా వెంకటేశ్వరావు మాట్లాడుతూ ప్రభుత్వం ఒక పక్క పాఠశాలలను మూసివేస్తూ ప్రభుత్వ విద్యను పేదలకు దూరం చేస్తున్నారని, సంక్షేమ హాస్టళ్లలో పూర్తిగా విద్యార్థులకు మౌలిక సదుపాయలు లేక, మెస్ ఛార్జీలు పెరగక ఇబ్బందులు పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. కెజిబివిల్లో ఇప్పటికీ సరిగ్గా టీచర్లు లేరని అన్నారు. విద్యార్థులు పోరాటాల ద్వారానే తమ సమస్యలు పరిష్కారం చేసుకోవాలని అన్నారు. ఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర కార్యదర్శి ఎ.అశోక్ మాట్లాడుతూ విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ తమ సొంత జిల్లాలో విద్యార్థుల సమస్యలు పరిష్కరించడంలో విఫలమయ్యారని అన్నారు. జిల్లాలో పాఠశాలలు, కళాశాలల విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు నేటి వరకు అందించలేదని అన్నారు. జిల్లాలో ప్రభుత్వ జూనియర్ కాలేజీలకు సరైన బిల్డింగులు లేవన్నారు. జీవో 77 తీసుకొచ్చి విద్యార్థులను ఉన్నత విద్యకు దూరం చేశారన్నారు. నూతన విద్యా విధానాన్ని రద్దు చేసి ప్రభుత్వ విద్యా రంగాన్ని అభివృద్ధి చెయ్యాలని కోరారు. ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి పి.రామ్మోహన్ రావు మాట్లాడుతూ జిల్లాలో మూత పడిన పరిశ్రమలు తెరిపించడంలోను, కొత్తవి స్థాపించండంలోను, ఉపాధి కల్పించడంలోను పాలకులు విఫలమయ్యారని అన్నారు. విద్యారంగంలో నెలకొన్న సమస్యలు పరిష్కరించా లని జిల్లా వ్యాప్తంగా 400 కిలోమీటర్లు సైకిల్‌యాత్ర చేసి సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్తామని తెలిపారు. అప్పటికీ పరిష్కరించకపోతే పెద్దఎత్తున ఆందోళన చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్‌ఎఫ్‌ఐ కేంద్ర కమిటీ సభ్యులు సిహెచ్ పావని, ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా అధ్యక్షులు సిహెచ్ వెంకటేష్, నాయకులు హర్ష తదితరులు పాల్గొన్నారు. సైకిల్‌యాత్రకు సిఐటియుజిల్లా ఉపాధ్యక్షులు తమ్మినేని సూర్యనారాయణ, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు గాడి అప్పారావు మద్దతు తెలిపారు.

మాట్లాడుతున్న ఎమ్మెల్సీ వెంకటేశ్వరరావు

జూనియర్ కళాశాల ఏర్పాటు చేయాలి

లక్కవరపుకోట : మండలంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల ఏర్పాటు చేయాలని ఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర కార్యదర్శి ఎ.అశోక్ డిమాండ్ చేశారు. లక్కవరపుకోట చేరుకున్న సైకిల్‌యాత్ర తొలుత ఎపి మోడల్ స్కూల్‌ను నాయకులు సందర్శించారు. ఈ సందర్భంగా అశోక్ మాట్లాడుతూ విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. వేసవి సెలవుల అనంతరం పాఠశాలలు తెరుచుకుని రెండు నెలలు కావస్తున్న నేటికీ చాలామందికి పాఠ్యపుస్తకాలు ఇవ్వకపోవడం బాధాకరమన్నారు. ఆర్భాటంగా చెప్పుకుంటున్న అమ్మఒడి పథకం ద్వారా ఇవ్వవలసిన డబ్బులు అనేకమంది తల్లులకు అందలేదన్నారు. నూతన విద్యా విధానాన్ని రద్దుచేసి ప్రభుత్వ విద్యారంగాన్ని అభివృద్ధి చేయాలన్నారు.



శృంగవరపుకోట వసతి గృహంలో విద్యార్థులతో మాట్లాడుతున్న ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు

నేడు ఎస్. కోటలో బహిరంగ సభ

శృంగవరపుకోట : పట్టణంలో మంగళవారం భారీ బహిరంగ సభ నిర్వహించనున్నట్లు ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి పి.రామ్మోహన్ తెలిపారు. ఎస్.కోటకు చేరుకున్న సైకిల్ యాత్రకు ఆర్‌టిసి కాంప్లెక్సు వద్ద విద్యార్థులు ఘన స్వాగతం పలికారు. దేవి కూడలిలో విద్యార్థులు వీధి నాటకాన్ని ప్రదర్శించారు. ఉదయం 10 గంటలకు దేవి బొమ్మ కూడలిలో జరిగే బహిరంగ సభకు విద్యార్థులు తరలిరావాలని రామ్మోహన్ కోరారు.

పేదలందరికీ సంక్షేమ పథకాలు

డిప్యూటీ సిఎం, జెడ్‌పి ఛైర్మన్

ప్రజాశక్తి-పాచిపెంట

అర్హులైన పేదలందరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందిస్తామని డిప్యూటీ సిఎం పి.రాజన్నదొర, జెడ్‌పి చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు అన్నారు. సోమవారం పాచిపెంట మండల కేంద్రంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ముందుగా గ్రామంలో ప్రధాన రహదారి మీదుగా భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరించారు. పథకాలు సక్రమంగా అందుతున్నాయా? లేదా అని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందజేయడమే గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ముఖ్య ఉద్దేశమన్నారు. అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందచేస్తామన్నారు. ఎవరూ అధైర్య పడవద్దని ప్రజలకు భరోసా ఇచ్చారు. సమస్యలు ఉంటే నేరుగా తెలియజేయాలని కోరారు. పింఛన్లు, పక్కా గృహాలు, అమ్మఒడి, చేయూత, ఆసరా, విద్యా కానుక, రైతు భరోసా వంటి పథకాలు గురించి ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో నాయకులు డోల బాబ్జి, టి.గౌరీశ్వరరావు, రంగునాయుడు, గొర్లె జగన్మోహనరావు, దండి శ్రీనివాసరావు, మీసాల చంటి, మజ్జి వెంకట్రావు, ఎంపిడిఒ జి.పార్వతి, తహశీల్దార్ ఆర్.రాజశేఖర్ పాల్గొన్నారు.

ఫెర్రోఎల్లాయీస్ పరిశ్రమల పరిరక్షణకు...

నేడు రాష్ట్ర స్థాయి సదస్సు

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

రాష్ట్రంలోని ఒడిదొడుకుల మధ్య నడుస్తున్న ఫెర్రో ఎల్లాయీస్ పరిశ్రమలను నిలబెట్టుకునేందుకు వాటిలో పనిచేస్తున్న కార్మికులు సన్నద్ధమౌతున్నారు. వీరందర్నీ ఐక్యం చేసిన సిఐటియు విజయనగరంలోని రెవెన్యూ కల్యాణమండపం వేదికగా మంగళవారం రాష్ట్ర స్థాయి సదస్సును నిర్వహిస్తోంది. ఈ సదస్సుకు సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్ నర్సింగరావు, రాష్ట్ర కార్యదర్శి సుబ్బరావమ్మ హాజరు కానున్నారు. అన్ని ఫెర్రోఎల్లాయీస్ కంపెనీల్లో పనిచేస్తున్న కార్మికులు పాల్గొంటారు. ముఖ్యంగా విద్యుత్ ఛార్జీల పెంపుకారణంగా పరిశ్రమలు కుదేలవుతున్న విషయం విధితమే. ఇటీవల పెంచిన ఛార్జీలతో పరిశ్రమలు నడపలేకపోతున్నామంటూ ఇప్పటికే పరిశ్రమల యాజమానులు ప్రభుత్వానికి తెలియజేశారు. మూసివేస్తామని కూడా చెప్పారు. ఇదే పరిస్థితి ఏర్పడితే రాష్ట్ర వ్యాప్తంగా సుమారు 30వేల మంది కార్మికులు, ప్రత్యక్షంగా, పరోక్షంగా జీవనోపాధి కోల్పోతారు. ఈనేపథ్యంలో విద్యుత్తు ఛార్జీలు తగ్గించాలని, పరిశ్రమల మనుగడకు తగిన ప్రోత్సాహం కూడా ఇవ్వాలని డిమాండ్ చేస్తూ ఈ సదస్సులో ఉద్యమ కార్యాచరణ రూపొందించనున్నారు.

సైన్సు, చరిత్ర పాఠాలు యథాతథంగా కొనసాగించాలి

విజయనగరం టౌన్: చరిత్ర, సైన్సు పాఠశాలను యథాతథంగా కొనసాగించాలని యుటిఎఫ్ నాయకులు డిమాండ్ చేశారు. యుటిఎఫ్ ఆధ్వర్యాన సోమవారం సాయంత్రం జెడ్‌పి మినిస్టీరియల్ 'సైన్స్-చరిత్ర పాఠ్యాంశాలు సిలబస్ నుండి తొలగింపు' అనే అంశం మీద రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో డివైఎఫ్ఐ, ఎస్‌ఎఫ్‌ఐ, యుటిఎఫ్ సంఘాల నుండి నాయకులు పాల్గొన్నారు. చరిత్ర, సైన్సు పాఠ్యాంశాల తొలగింపు అప్రజాస్వామికంగా, మత విద్వేషాలను రెచ్చగొట్టేటట్టుగా ఉందని వక్తలు అభిప్రాయపడ్డారు. సైన్సు చరిత్ర పాఠాలను తిరిగి యథాతథంగా కొనసాగించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో యుటిఎఫ్ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు జెఆర్‌సి పట్నాయక్, జెవిఎఆర్‌కె ఈశ్వరరావు, యుటిఎఫ్ ఎడ్యుకేషన్ సబ్ కమిటీ జిల్లా కన్వీనర్ కె శ్రీనివాసరావు, డివైఎఫ్ఐ నాయకులు సతీష్, ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు హరీష్, యుటిఎఫ్ జిల్లా కార్యదర్శులు సిహెచ్ తిరుపతి నాయుడు, జి రాజారావులు పాల్గొన్నారు.

సాగునీటి ప్రాజెక్టులను నీరుగార్చారు

టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు గుమ్మడి సంధ్యారాణి

ప్రజాశక్తి-పార్వతీపురంరూరల్

ఎన్నికల ముందుగా మాయమాటలు చెప్పిన సిఎం జగన్.. అధికారంలోకి వచ్చాక సాగునీటి ప్రాజెక్టులను నీరుగార్చారని టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు గుమ్మడి సంధ్యారాణి విమర్శించారు. సోమవారం స్థానిక టిడిపి జిల్లా కార్యాలయంలో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆమె మాట్లాడారు. వైసిపి అనుసరించిన రివర్స్ విధానం వల్ల ప్రాజెక్టులన్నీ పడకేశాయన్నారు. కాలువల్లో వ్యర్థాలు, పూడికలు తొలగించకుండా నీరు విడుదల చేశామని గొప్పలు చెప్పుకుంటున్నారని ధ్వజమెత్తారు. దీనివల్ల రైతులకు సాగునీరు అందే పరిస్థితి లేదన్నారు. ఈ నెల 9న టిడిపి అధినేత చంద్రబాబు తోటపల్లి ప్రాజెక్టును సందర్శిస్తారని తెలిపారు. అనంతరం పార్వతీపురం పట్టణంలో బహిరంగ సభను నిర్వహిస్తారని, ఈ పర్యటనను విజయవంతం చేయాలని కోరారు. అనంతరం మాజీ మంత్రి శత్రుచర్ల విజయరామరాజు మాట్లాడారు. సమావేశంలో మాజీ ఎమ్మెల్సీ డి.జగదీష్, పార్వతీపురం, పాలకొండ, కురుపాం నియోజకవర్గ ఇన్‌ఛార్జులు బోనెల విజయచంద్ర, నిమ్మక జయకృష్ణ, తోయక జగదీశ్వరి, నాయకులు ఆర్‌పి భంజ్‌దేవ్, గులిపల్లి సుధాకర్, గొట్టాపు వెంకటనాయుడు, డొంకాడ రామకృష్ణ, మజ్జి కృష్ణమోహన్ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు గుమ్మడి సంధ్యారాణి

చిరంజీవులుకు పార్టీలో సముచిత గౌరవం

పార్వతీపురం మాజీ ఎమ్మెల్యే బొబ్బిలి చిరంజీవులు చేసిన సేవలను పార్టీ ఎన్నటికీ మరిచిపోదని సంధ్యారాణి తెలిపారు. ప్రస్తుతం అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన కోలుకున్నాక సముచిత గౌరవం ఇచ్చి, కలుపుకుంటూ వెళ్తామని విలేకర్లు అడిగిన ప్రశ్నకు సమాధానమిచ్చారు.

3న మన్యం బంద్

ప్రజాశక్తి-గుమ్మలక్ష్మీపురం

ఈ నెల మూడో తేదిన చేపట్టే మన్యం బంద్‌ను విజయవంతం చేయాలని ఆదివాసీ హక్కుల వేదిక కన్వీనర్ కోలక అవినాష్ కోరారు. సోమవారం గుమ్మలక్ష్మీపురంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం ఆర్ఎస్ఎస్ భావజాలంతో మణిపూర్‌లో గిరిజనులపై దాడులకు పాల్పడుతూ మారణ హోమం సృష్టిస్తోందన్నారు. కార్పొరేట్ సంస్థలకు కొమ్ముకాస్తూ బాక్సైట్ తవ్వకాలకు విచ్చలవిడిగా అనుమతులు ఇస్తోందని విమర్శించారు. రాజ్యాంగం గిరిజనులకు కల్పించిన హక్కులు, చట్టాలకు రక్షణ లేకుండా పోయిందన్నారు. మణిపూర్‌లో ఆదివాసీలపై కార్పొరేట్, మతోన్మాద శక్తుల మారణ హోమం ఆపాలని, బీరేన్ సింగ్ ప్రభుత్వాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. గిరిజనులను అడవి నుంచి వెళ్లగొట్టే ప్రయత్నం కోసమే నూతన అటవీ సంరక్షణ చట్టం తీసుకువచ్చిందన్నారు. నూతన అటవీ సంరక్షణ చట్టాన్ని రద్దు చేయాలని, గ్రామసభలకు అధికారాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. గిరిజనుల సాగులో ఉన్న భూములకు పట్టాలు మంజూరు చేయాలన్నారు. జిఒ నెంబర్ 3ను చట్టబద్ధం చేయాలని కోరారు. ఈ డిమాండ్లతో మన్యం బంద్ చేపడుతున్నట్లు తెలిపారు. బంద్‌కు వర్తక, వ్యాపారులు, ఆటో, రిక్షా కార్మికులు, ఉద్యోగులు సహకరించాలని కోరారు.

సీతంపేట : ఈ నెల 3న చేపట్టే మన్యం బంద్ విజయవంతం చేయాలని గిరిజన సంఘం జిల్లా అధ్యక్షులు ఎం.లక్ష్మణరావు కోరారు. సోమవారం సీతంపేటలోని గిరిజన సంఘం కార్యాలయంలో విలేకరులతో ఆయన మాట్లాడారు. మణిపూర్ ఆదివాసీలపై జరుగుతున్న హింసలో 160 మంది మరణించారని, 500 మందికి పైగా తీవ్రంగా గాయపడ్డారని ఆవేదన వ్యక్తంచేశారు. 10 వేల ఇళ్లను ధ్వంసం చేశారని చెప్పారు. 60 వేల మంది ఆదివాసీలు పునరావాస కేంద్రాల్లో ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని బిక్కుబిక్కుమంటూ గడుపుతున్నారని తెలిపారు. తక్షణమే వారికి రక్షణ కల్పించాలన్నారు. పార్లమెంట్‌లో ఆమోదించిన అటవీ పర్యావరణ సవరణ చట్టం రద్దు చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో గిరిజన సంఘం మండల అధ్యక్ష, కార్యదర్శులు జె.శ్రీరాములు, బి.సాయి పాల్గొన్నారు.

అర్జీదారులతో మాట్లాడుతున్న కలెక్టర్ నిశాంత్‌కుమార్

అర్జీలకు సత్వర పరిష్కారం

ప్రజాశక్తి-బెలగాం

ప్రజల నుంచి జగనన్నకు చెబుదాం కార్యక్రమానికి వచ్చిన అర్జీలను సత్వరమే క్షేత్ర స్థాయిలో విచారించి, పరిష్కారం చూపించాలని జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో జగనన్నకు చెబుదాం కార్యక్రమాన్ని నిర్వహించారు. జాయింట్ కలెక్టర్ ఆర్.గోవిందరావు, ఐటిడిఎ పిఒ సి.విష్ణుచరణ్‌తో కలిసి ప్రజల నుండి వినతులను స్వీకరించారు. అర్జీలను పరిశీలించిన కలెక్టర్.. సంబంధిత అధికారులకు పరిష్కారం కోసం ఆదేశాలు జారీ చేశారు. కార్యక్రమంలో డిఆర్‌డిఎ పీడీ పి.కిరణ్ కుమార్, డిఎంహెచ్ఒ జగన్నాథరావు, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి రాబర్ట్ పాల్, ఆర్.డబ్ల్యు.ఎస్. ఇంజినీరింగ్ అధికారి ప్రభాకర రావు, డిపిఒ బి.సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి విజయచంద్ర

పార్టీ బలోపేతానికి నిర్విరామ కృషి

టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి విజయచంద్ర

ప్రజాశక్తి-పార్వతీపురంరూరల్

నియోజకవర్గంలో పార్టీని బలోపేతం చేసేందుకు నిర్విరామంగా కృషి చేస్తానని టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి బోనెల విజయచంద్ర వెల్లడించారు. రాష్ట్రంలో రాక్షసపాలనను అంతమొందించి, చంద్రబాబును ముఖ్యమంత్రిని చేయడమే ధ్యేయంగా పనిచేస్తానన్నారు. నియోజకవర్గ ఇన్‌ఛార్జిగా నియమితులయ్యాక తొలిసారి పార్వతీపురం వస్తున్న సోమవారం నరిసిపురం వద్ద మాజీ ఎమ్మెల్సీ ద్వారపురెడ్డి జగదీష్ ఆధ్వర్యంలో టిడిపి నాయకులు, కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు. అనంతరం ఎన్‌టిఆర్, అంబేద్కర్ విగ్రహాలకు ఆయన పూలమాలలు వేసి నివాళు లర్పించారు. అక్కడి నుంచి భారీ బైక్‌ర్యాలీతో పట్టణంలోని పాతబస్టాండ్‌లో ఎన్‌టిఆర్ విగ్రహం వద్దకు చేరుకున్నారు. అనంతరం టిడిపి కార్యాలయంలో జగదీష్ అధ్యక్షతన జరిగిన నియోజకవర్గ కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. తనకు నియోజకవర్గ బాధ్యతలు అప్పగించిన చంద్రబాబుకు, లోకేష్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ప్రతిపక్షాలను అణచివేయడమే లక్ష్యంగా కొనసాగుతున్న నీచరాజకీయాలకు భయపడకుండా, ప్రతి కార్యకర్తలో ధైర్యం నింపుతానని చెప్పారు. తక్కువగా మాట్లాడి ఎక్కువగా పనిచేయడమే తన తత్వమని, అందుకు అనుగుణంగా పనిచేసి అందరిని కలుపుకుపోతానని తెలియజేశారు. సమావేశంలో మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ ద్వారపురెడ్డి శ్రీదేవి, తదితరులు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజన కార్మికుల ధర్నా

ప్రజాశక్తి-కలెక్టరేట్

మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యల పరిష్కరించాలని సోమవారం కలెక్టరేట్ ఎదుట సిఐటియు ఆధ్వర్యాన ధర్నా చేశారు. అనంతరం కలెక్టర్‌కు వినతి అందించారు. ఈ సందర్భంగా మధ్యాహ్న భోజన కార్మికుల సంఘం నాయకులు శాంతికుమారి మాట్లాడుతూ 20 ఏళ్ల నుంచి వెట్టిచాకిరీ చేయిస్తోన్న ప్రభుత్వం కనీసం తమ సమస్యలను పట్టించుకోవడం లేదన్నారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా మెనూ ఛార్జీలు పెంచాలని కోరారు. వేతనాలు పెంచాలని, స్కూళ్లలో మౌలిక సదుపాయాలు కల్పించాలని డిమాండ్ చేశారు. సబ్సిడీ ధరలకే గ్యాస్ సరఫరా చేయాలన్నారు. యూనిఫాం, గుర్తింపు కార్డులు ఇవ్వాలని, గ్రూప్ ఇన్సూరెన్స్ కల్పించాలని కోరారు. రాజకీయ వేధింపులు ఆపాలని డిమాండ్ చేశారు. శ్రామిక మహిళా నాయకురాలు వి.ఇందిర మాట్లాడుతూ బలిజిపేట మండలం పి.చాకరపల్లి గ్రామంలో తట్టుకోటి గణమ్మను అకారణంగా విధుల నుంచి తొలగించారని తెలిపారు. రాజకీయ వేధింపులు ఆపి, వెంటనే ఆమెను విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. వీరి ఆందోళనకు సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి యమ్మల మన్మథరావు మద్దతు తెలిపారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షులు తులసి, కార్మికులు లక్ష్మి, పద్మ, రొయ్యబరమ్మ, పావని, సుశీల, సావిత్రి, శ్రీదేవి సిఐటియు పట్టణ నాయకులు బి.సూరిబాబు, తదితరులు పాల్గొన్నారు.

ధర్నా చేస్తున్న మధ్యాహ్న భోజన కార్మికులు, సిఐటియు నాయకులు

ర్యాలీలో పాల్గొన్న ఫాస్టర్లు, క్రైస్తవులు

మణిపూర్ హింసకు వ్యతిరేకంగా ర్యాలీ

ప్రజాశక్తి-సాలూరు

మణిపూర్ రాష్ట్రంలో హింసకు వ్యతిరేకంగా ఆదివారం పట్టణ ఫెలోషిప్ ఫాస్టర్స్ ఆధ్వర్యాన క్రైస్తవులు ర్యాలీ నిర్వహించారు. మూడు నెలలుగా మణిపూర్‌లో దారుణమైన హింసాత్మక ఘటనలు జరుగుతున్నాయని, వాటి నియంత్రణలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయని పలువురు ఆగ్రహం వ్యక్తంచేశారు. మరణించిన వారి కుటుంబాలకు పరిహారం చెల్లించాలని డిమాండ్ చేస్తూ బోసుబొమ్మ జంక్షన్ వద్ద నిరసన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో శాంతి నెలకొల్పేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రిపబ్లికన్ పార్టీ నాయకులు గొంప ప్రకాశరావు, ఫాస్టర్ సువార్తరావు, మాజీ కౌన్సిలర్ ఎం.అప్పారావు పాల్గొన్నారు.

నేడు మున్సిపల్ కార్యాలయ ముట్టడి

ప్రజాశక్తి-పాలకొండ రూరల్

కార్మికుల సమస్యలపై మంగళవారం పాలకొండ నగర పంచాయతీ కార్యాలయాన్ని ముట్టడించనున్నట్లు సిఐటియు జిల్లా అధ్యక్షులు దావాల రమణారావు తెలిపారు. సోమవారం పట్టణంలో నగర పంచాయతీ కార్మికులతో సమావేశాన్ని ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆప్కోస్ పరిధిలో ఉన్న కార్మికులందరినీ పర్మినెంట్ చేయాలన్నారు. సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, చనిపోయిన కార్మిక కుటుంబ సభ్యులకు ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేశారు. పట్టణంలో కార్మికుల సంఖ్య పెంచాలన్నారు. వీటన్నింటిపై నగర పంచాయతీ కార్యాలయాన్ని ముట్టడిస్తున్నామని, ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో మున్సిపల్ వర్కర్స్ అండ్ హెల్పర్స్ ఫెడరేషన్ అధ్యక్షులు పడాల భాస్కర్ రావు, కార్యదర్శి చింతల సంజీవి, కోశాధికారి పడాల వేణు, ఉపాధ్యక్షులు చింతల సురేష్, కార్యవర్గ సభ్యులు శ్రీదేవి, విమల, రఘు తదితరులు పాల్గొన్నారు.

పక్కాగా సరుకుల తూకం

ప్రజాశక్తి-పార్వతీపురం

రేషన్ సరుకుల తూకం పక్కాగా ఉండాలని సంయుక్త కలెక్టర్ ఆర్.గోవిందరావు ఆదేశించారు. ఈ మేరకు శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఎంఎల్ఎస్ పాయింట్ల నుండి చౌకధరల డీలర్లకు, అక్కడి నుండి రేషన్ కార్డుదారులకు అందే సరుకులలో ఎటువంటి తేడాలు ఉండరాదని స్పష్టం చేశారు. జిల్లాలో ఉన్న ఎనిమిది ఎంఎల్ఎస్ పాయింట్ ఇన్‌ఛార్జుల పరిధిలో ఉన్న రేషన్ షాపులకు శత శాతం తూకం డీలర్ సమక్షంలోనే వేసి, అప్పగించాలని చెప్పారు. దీనిపై సిఎస్ డిటిలు, విఆర్ఒల పర్యవేక్షణ ఉండాలని సూచించారు. రేషన్ షాప్ డీలర్లు సంబంధిత ఎండియు ఆపరేటర్లకు శత శాతం తూకంతో అప్పగించాలని ఆదేశించారు. జిల్లాలోని 196 ఎండియు ఆపరేటర్లు, సిబ్బంది సరైన తూకంతో వారికి కేటాయించిన బియ్యం, అన్నిసరుకులు కార్డుదారులకు విధిగా పంపిణీ చేయాలని ఆదేశించారు. ఏదో ఒక ప్రదేశంలో ఉండి పంపిణీ చేయకుండా కార్డుదారుల ఇంటి వద్దకు వెళ్లి అందించాలని స్పష్టం చేశారు. తూనికలో తేడాలు గమనిస్తే టోల్ ఫ్రీ నంబరు - కాల్ సెంటర్ 1967కు ఫిర్యాదు చేయాలని కోరారు. అక్రమాలు, అవకతవకలు గుర్తిస్తే సిబ్బందిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ముసురు పట్టిన మన్యం

ప్రజాశక్తి-గుమ్మలక్ష్మీపురం

గుమ్మలక్ష్మీపురం మన్యం ముసురు పట్టింది. సోమవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు ఎడతెరిపి లేకుండా వర్షం పడడంతో వ్యాపారులు, ఉద్యోగులు, విద్యార్థులు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. మరోవైపు వ్యవసాయ పనులు చేపడుతున్న సమయంలో వర్షాలు పడడంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఖరీఫ్ పనులు వేగవంతం కావడానికి ఈ వర్షం ఎంతో అనుకూలంగా ఉంటుందని భావిస్తున్నారు. కురుస్తున్న వర్షంతో గ్రామాల్లో అపారిశుధ్య వాతావరణం కనిపిస్తోంది. ఈగలు, దోమలు వ్యాప్తి చెందడంతో వ్యాధులు విజృంభించే అవకాశం ఉందని ప్రజలు భయపడుతున్నారు. అధికారులు స్పందించి పారిశుధ్య పనులు, ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

గాంధీ విగ్రహానికి వినతి అందిస్తున్న విద్యుత్తు ఉద్యోగులు

గాంధీ విగ్రహానికి విద్యుత్తు ఉద్యోగుల వినతి

ప్రజాశక్తి-పార్వతీపురం టౌన్

తమ సమస్యల పరిష్కారం కోసం విద్యుత్తు ఉద్యోగుల జెఎసి ఆధ్వర్యంలో సోమవారం మధ్యాహ్న భోజన విరామ సమయంలో పట్టణంలో ప్రధాన రహదారిలో ఉన్న గాంధీ విగ్రహానికి వినతి పత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా జెఎసి నాయకులు మాట్లాడారు. కాంట్రాక్ట్ కార్మికులను, ఎనర్జీ అసిస్టెంట్ గ్రేడ్-2 జెఎల్ఎంలను రెగ్యులర్ చేయాలన్నారు. పెండింగ్లో ఉన్న డిఎలను ఇవ్వాలని కోరారు. కొత్తగా ఏర్పడిన జిల్లాల్లో కొత్త పోస్టులు మంజూరు చేయాలని, 2022 పిఆర్‌సిని అమలు చేయాలని డిమాండ్ చేశారు.

లయన్స్ క్లబ్ నూతన కార్యవర్గ ప్రమాణం

ప్రజాశక్తి-సాలూరు

లయన్స్ క్లబ్ నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకారం చేసింది. పట్టణంలోని ఫిలడెల్ఫియా ఆసుపత్రి కమ్యూనిటీ హాల్లో నిర్వహించిన కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షులుగా కర్రి వెంకట్రావు, కార్యదర్శిగా జగన్మోహన్, కోశాధికారిగా వానపల్లి ఈశ్వరరావు బాధ్యతలు స్వీకరించారు. కర్రి వెంకట్రావు రెండో సారి క్లబ్ అధ్యక్షులుగా బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా పూర్వ అధ్యక్షులు అప్పికొండ సాంబమూర్తి, జర్జాపు సూరిబాబు, డాక్టర్ వి.గణేశ్వరరావు, కొత్త కార్యవర్గాన్ని అభినందించారు. క్లబ్ ఆధ్వర్యాన మరిన్ని సామాజిక కార్యక్రమాలు చేపట్టాలని కోరారు.

కిడ్నీ బాధితుడికి ఆర్థిక సాయం

ప్రజాశక్తి-సాలూరు

స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థి ఎస్.దుర్గాప్రసాద్ రెండు కిడ్నీలు పాడవడంతో దాతలు ఆయనకు ఆర్థిక సాయం అందించడానికి ముందుకు వస్తున్నారు. బంగారమ్మ కాలనీకి చెందిన దుర్గాప్రసాద్ కొంతకాలంగా కిడ్నీ సమస్యతో బాధపడుతున్నారు. చికిత్సకు పదిలక్షల రూపాయల ఖర్చు అవుతుందని వైద్యులు సూచిస్తున్నారు. దీంతో దుర్గాప్రసాద్ మిత్రులు దాతల సాయం కోరుతున్నారు. దుర్గాప్రసాద్ కుటుంబానికి సోమవారం రూ.10 వేల చెక్కును మీకై మేము స్వచ్ఛంద సంస్థ అధ్యక్షులు ఇప్పిలి దిలీప్ కుమార్ ఆధ్వర్యాన సభ్యులు అందజేశారు.

నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు

ప్రజాశక్తి-బలిజిపేట

ప్రభుత్వ నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవని ఎఎస్ఐ పాణిగ్రహి అన్నారు. మండలంలో బొబ్బిలి-బలిజిపేట ప్రధాన రహదారిపై సోమవారం వాహనాల తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాహన ధ్రువపత్రాలు, లైసెన్సు తప్పనిసరిగా కలిగి ఉండాలన్నారు.

విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ

ప్రజాశక్తి-సీతంపేట

పాలకొండకు చెందిన హర్షవెల్లి సంస్కృతి సాంఘిక సేవా సంస్థ ఆధ్వర్యంలో ఒంటరిమో టీచర్స్ ఫెడరేషన్ సహకారంతో సీతంపేట మండలంలో పెద్దూరు, వలగెడ్డ, పనుకువలస, సోమగండి, సీతంపేట తదితర పాఠశాలల్లో విద్యార్థులకు అల్లావుద్దీన్ అబ్దుల్ కథలు, బాల గేయాలు, మురిపించే బొమ్మలు, జంతువులు మొదలగు వాటికి సంబంధించి పుస్తకాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సంస్థ అధ్యక్షులు నందాన సుధాకర్ వీటిని సక్రమంగా వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో సంస్థ చైర్మన్ మోహన్ రావు, సెక్రటరీ నడిమింటి శ్రీనివాసరావు, రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయుడు నెల్లి సత్యంనాయుడు, హెచ్ఎం ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

డ్వాక్రా మహిళలకు రుణాలివ్వాలి

ప్రజాశక్తి సీతానగరం

డ్వాక్రా మహిళలకు రుణాలను మంజూరు చేయాలని ఎపిడి వై.సత్యం నాయుడు కోరారు. సోమవారం ఎపిజివిబి, ఎస్‌బిఐ బ్రాంచ్ మేనేజర్లను ఆయన కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పిఎంఇజిపి పథకంలో రుణాలు మంజూరు చేయాలన్నారు. పొదుపు సంఘాల మహిళలు ఆర్థికాభివృద్ధి చెందాలంటే బ్యాంకుల సహకారం ఎంతో అవసరమని చెప్పారు. దీనికి మేనేజర్ స్పందిస్తూ అర్హులైన సంఘాలకు మంజూరు చేస్తామన్నారు. కార్యక్రమంలో ఎపిఎం ఆర్.శ్రీరాములు పాల్గొన్నారు.

యూరియా పంపిణీకి సిద్ధం

ప్రజాశక్తి-గరుగుబిల్లి

ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌కి సంబంధించి రైతులకు అవసరమైన యూరియాను సరఫరా చేసేందుకు వ్యవసాయ శాఖాధికారులు తగు చర్యలు చేపడుతున్నారు. ఈ మేరకు మండల పరిధిలోని ఉల్లిభద్ర రైతు భరోసాకేంద్రంలో సోమవారం యూరియాను సిద్ధం చేశారు. ఉల్లిభద్ర ఆర్‌బికె పరిధిలోని ఉల్లిభద్ర, కొంకడివరం, సీతారాంపురం గ్రామాల రైతులకు యూరియాను పంపిణీ చేస్తామని ఎఒ ఆర్.విజయభారతి, విఎఎ గాయత్రిదేవి తెలిపారు.

ఏగోటివలసలో వైద్య శిబిరం

ప్రజాశక్తి-సీతానగరం

మండలంలోని ఏగోటివలస గ్రామంలో సోమవారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంలో భాగంగా వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి రాధాకాంత్ రోగులకు పరీక్షలు చేసి, మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ వెంకటేష్, ఎఎన్ఎం రమాదేవి పాల్గొన్నారు. చల్లంనాయుడు వలసలో కంటి వెలుగు కార్యక్రమం నిర్వహించి, కళ్ల తనిఖీలు చేపట్టారు.

సింధూనగరలో ఫ్యామిలీ డాక్టర్

వీరఘట్టం : మండలంలోని సింధు నగర గిరిజన గ్రామంలో సోమవారం 104 ఆధ్వర్యంలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. స్థానిక పిహెచ్‌సి వైద్యాధికారి పి.ఉమామహేశ్వరి జ్వర పీడితులు, రోగులకు తనిఖీలు నిర్వహించారు. మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ ఒ.శాంతికుమారి, ఎఎన్ఎంలు జి.హేమ, ఎన్.ఉషారాణి, సిబ్బంది పాల్గొన్నారు.

40 లీటర్ల సారా పట్టివేత

ప్రజాశక్తి-సీతంపేట

మండలంలో కుడ్డపల్లి, ఈతమానుగూడ సమీపంలో మండంగి మణికంఠ, కూరంగి గంగారావు 40 లీటర్లు సారా తెస్తుండగా ఎస్ఐ నీలకంఠరావు పట్టుకున్నారు. దీనిపై కేసు నమోదు చేశారు. సారా విక్రయించినా, తయారుచేసినా కేసులు తప్పవని ఎస్ఐ హెచ్చరించారు.

సం'క్షోభ' హాస్టల్

- శిథిలావస్థకు చేరిన వసతి గృహం
- విద్యార్థులకు కనీస వసతులు కరువు
- పట్టించుకోని అధికారులు

శిథిలమైన వసతి గృహం పిల్లర్

ప్రజాశక్తి - శృంగవరపుకోట

విద్యాభివృద్ధికి కోట్ల రూపాయలు వెచ్చిస్తున్నామని నాడు నేడు ద్వారా పాఠశాలలు, వసతి గృహాలు అభివృద్ధి చేస్తున్నామని ప్రభుత్వం ప్రకటనలు గుప్పిస్తున్నప్పటికీ ప్రభుత్వ వసతి గృహాల్లో అటువంటి సౌకర్యాలు కానరావడం లేదు. అసౌకర్యాల నడుమ వసతి గృహాల విద్యార్థులు పడుతున్న అవస్థలు వర్ణనాతీతమనే చెప్పాలి..

మండలంలోని అతిపెద్ద మేజర్ పంచాయితీ అయిన ధర్మవరం గ్రామంలో వెనుకబడిన తరగతుల ప్రీ మెట్రిక్ వసతి గృహంలో విద్యార్థులు అసౌకర్యాలతో సతమతమవుతున్నారు. వసతి గృహ భవనం శిథిలావస్థకు చేరింది. దీంతో స్లాబ్ పెచ్చులూడి ఎప్పుడు మీద పడతాయోనని విద్యార్థులు బిక్కుబిక్కుమంటూ కాలం వెళ్లదీస్తున్నారు. మూడేళ్ల క్రితం నీటి పథకం మరమ్మతులకు గురవడంతో కాలకృత్యాలు తీర్చుకునేందుకు, బట్టలు ఉతుక్కోవటానికి, వంటకు ఇబ్బంది పడుతున్నారు. నీటి సదుపాయం లేక మరుగుదొడ్లు నిరుపయోగంగా మారాయి. బకెట్‌తో నీళ్లు తీసుకుని మరుగుదొడ్లను ఉపయోగిస్తే ట్యాంక్ అవుట్ లెట్ లేక మరుగుదొడ్లు నీటితో కూడిన పిట్‌తో నిండి దుర్గంధాన్ని వెదజల్లుతోంది. ఈ వసతి గృహం ప్రహరీ హుదూద్ తుఫాన్ సమయంలో ఓ పక్క కూలిపోవడం వసతి గృహం చుట్టు పక్కల పొలాలు ఉండటం, చెట్లు పొదలతో నిండి ఉండటం వల్ల వసతి గృహ భవనంలోకి విష సర్పాలు ప్రవేశిస్తున్నాయని విద్యార్థులు ఆందోళన చెందుతున్నారు. వీటితోపాటు పందులు యథేచ్ఛగా సంచరిస్తున్నాయని ఇవి మలమూత్రాలను విసర్జించి దుర్గంధం వెదజల్లుతున్నాయని ఫలితంగా వ్యాధుల బారిన పడుతున్నామని విద్యార్థులు వాపోతున్నారు. అధికారులు స్పందించి ఈ సమస్యలు పరిష్కరించాలని విద్యార్థులు కోరుతున్నారు.

శిథిలమైన సోలార్ వాటర్ హీటర్

ప్రభుత్వం మెస్ బిల్లులు చెల్లించటం లేదు

వసతి గృహంలో 80 మంది విద్యార్థులు ఉన్నారు. సుమారు 6 నెలల నుండి ప్రభుత్వం మెస్ బిల్లులు చెల్లించటం లేదు. అప్పులు చేసి విద్యార్థులకు భోజనం పెడుతున్నాం. హాస్టల్ భవనం శిథిలావస్థకు చేరింది. విద్యార్థుల స్నానాలకు వేడి నీళ్లను అందించే సోలార్ ప్లాంట్ పూర్తిగా పాడైంది. కాంపౌండ్ వాల్ కొంతమేర కూలిపోయింది. బాత్రూం రన్నింగ్ వాటర్ లేదు. లేవట్రీ ట్యాంకకు వచ్చే పైపులు శిథిలమయ్యాయి. వేస్ట్ వాటర్ అవుట్ పుట్ లేదు. స్లాపు సీలింగ్ కూడా కొన్ని చోట్ల పెచ్చులుడుతున్నాయి. పైన ఫ్లోరింగ్ కూడా పెట్టించాలి. వీటన్నింటి నిర్మాణాల కోసం ఇష్టమేసన్ వేసి పంపించాం కానీ నిధులు మంజూరు కాలేదు.

ఎస్. సత్యనారాయణ రెడ్డి, వసతి గృహం వార్డెన్.

డంపింగ్‌యార్డు ఏర్పాటుకు సహకరించాలి

ఎమ్మెల్సీ విక్రాంత్

సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ విక్రాంత్

ప్రజాశక్తి-పాలకొండ

టిడిపారాపురం గ్రామంలో డంపింగ్‌యార్డు నిర్మాణానికి కౌన్సిలర్లు అందరూ సహకరించాలని ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ కోరారు. సోమవారం నగర పంచాయతీ కార్యాలయంలో కౌన్సిల్ సాధారణ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ పాలకొండ నగర పంచాయతీకి డంపింగ్‌యార్డ్ ప్రధాన సమస్యగా మారిందన్నారు. పాలకొండను పరిశుభ్రంగా ఉంచేందుకు డంపింగ్‌యార్డ్ అవసరం ఉందన్నారు. దీనికి కౌన్సిలర్లు అందరూ సహకరించాలని కోరారు. ఈ విషయంలో తనకు అనేక అవమానాలు ఎదురయ్యాయని, అయినా వెనక్కి తగ్గే ప్రసక్తే లేదని స్పష్టంచేశారు. డంపింగ్‌యార్డ్ నిర్మాణం చేపట్టి తీరుతామని తెగేసిచెప్పారు. దసరా నాటికి ఈ పనులు పూర్తి చేయాలన్నారు. విద్యుత్తు శాఖ ఎఇ గోరు రమేష్‌పై ఎమ్మెల్సీతోపాటు కౌన్సిలర్లు మండిపడ్డారు. నగర పంచాయతీకి సంబంధించి రూ.30 లక్షలు నిధులు విద్యుత్తు స్తంభాలకు కేటాయిస్తే, కనీసం ఆయా వార్డుల్లో ఎక్కడ వేయాలన్న అంశంపై కౌన్సిలర్లను సంప్రదించకపోవడంపై మూకుమ్మడిగా నిలదీశారు. ఎఇ పనితీరు మార్చుకోవాలని ఎమ్మెల్సీ మందలించారు. సమావేశంలో చైర్‌పర్సన్ యందవ రాధాకుమారి, వైస్‌చైర్మన్లు పల్లా ప్రతాప్, హనుమంతురావు, కమిషనర్ సర్వేశ్వరరావు, కౌన్సిలర్లు దుప్పాడ పాపినాయుడు, వెలమల మన్మథరావు, గంగునాయుడు, కిల్లారి మోహన్ తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జోగారావు

మున్సిపల్ సమావేశాన్ని మమా అనిపించేశారు!

ప్రజాశక్తి- పార్వతీపురం టౌన్

పార్వతీపురం మున్సిపల్ కార్యాలయంలో సోమవారం చైర్‌పర్సన్ బోను గౌరీశ్వరి అధ్యక్షతన జరిగిన సాధారణ సమావేశాన్ని తూతూ మంత్రంగా నిర్వహించారు. ఈ సమావేశానికి ప్రతిపక్ష కౌన్సిల్ సభ్యులు హాజరు కాలేదు. ఎమ్మెల్యే అలజంగి జోగారావు ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ముందుగా అజెండాలో పొందుపరిచిన 31 అంశాలను మున్సిపల్ అధికారి చదివి వినిపించారు. అధికార పార్టీ సభ్యులు ఏకగ్రీవంగా ఆమోదించి, సమావేశాన్ని వేగంగానే ముగించేశారు. వార్డులలో శానిటేషన్, విద్యుత్తు దీపాలు సక్రమంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని కౌన్సిలర్లు కోరగా, చర్యలు తీసుకుంటామని కమిషనర్ రామప్పలనాయుడు తెలిపారు. సమావేశంలో మున్సిపల్ వైస్‌చైర్మన్లు కొండపల్లి రుక్మిణి, యిండుపూరు గున్నేశ్వరరావు, ఫ్లోర్ లీడర్ మంత్రి రవికుమార్, ఎఇ ఆనంద్, తదితరులు పాల్గొన్నారు.

9న చంద్రబాబు జిల్లా పర్యటన

ప్రజాశక్తి-గుమ్మలక్ష్మీపురం

ఈ నెల 9న పార్వతీపురం మన్యం జిల్లా పర్యటనకు టిడిపి అధినేత చంద్రబాబునాయుడు వస్తున్నారని, ఈ పర్యటనను విజయవంతం చేయాలని ఎస్‌టి సెల్ అరకు పార్లమెంటరీ నియోజకవర్గ అధ్యక్షులు నందివాడ కృష్ణబాబు కోరారు. గుమ్మలక్ష్మీపురంలో సోమవారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. కురుపాం నియోజకవర్గంలోని ఐదు మండలాల నుంచి నాయకులు, కార్యకర్తలు పెద్దఎత్తున హాజరుకావాలని పిలుపునిచ్చారు. 2024 ఎన్నికల్లో కురుపాం నియోజకవర్గంలో నిజమైన గిరిజనులకే టికెట్ ప్రకటిస్తారని ఆశాభావం వ్యక్తంచేశారు. వైసిపి నాలుగేళ్ల పాలనలో గిరిజన అభివృద్ధి పూర్తిగా కుంటుపడిందన్నారు. చాలా గ్రామాల్లో గిరిజనులు తాగడానికి కనీసం మంచినీరు కూడా అందుబాటులో లేదని ఆవేదన వ్యక్తంచేశారు. గిరిశిఖర గ్రామాలకు రహదారి సౌకర్యం లేకపోవడంతో గిరిజనులు డోలి సహాయంతో వైద్యం కోసం రోగులను తీసుకొస్తున్నా ప్రభుత్వానికి కనీసం పట్టడం లేదన్నారు. పాఠశాలల విలీనం పేరుతో గిరిజనులకు విద్యను దూరం చేస్తున్నారన్నారు. వర్షాకాలం దృష్టిలో పెట్టుకొని గ్రామాల్లో వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలని, ఆస్పత్రిలో అన్ని రకాల మందులు అందుబాటులో ఉంచాలని కోరారు.

'పార్టీకి నష్టం కలిగిస్తే సహించబోం'

నియోజకవర్గంలో టిడిపిని బలహీన పరిచే చర్యలకు పాల్పడితే సహించేది లేదని ఆ పార్టీ కురుపాం నియోజకవర్గ పరిశీలకులు ఆరేటి మహేష్‌బాబు ఒక ప్రకటనలో హెచ్చరించారు. 'గీత దాటితే వేటు' సోషల్ మీడియాలో, కొన్ని పత్రికల్లో వచ్చే అవాస్తవాలు నమ్మవద్దని కార్యకర్తలకు తెలియజేశారు. పార్టీ కోసం కష్టపడిన వారికి తగిన గుర్తింపు ఉంటుందని చెప్పారు. నియోజకవర్గంలో సమస్యలపై ప్రజా పోరాటాలు ఐక్యంగా నిర్వహించాలని పిలుపునిచ్చారు. ఈ నెల 9న టిడిపి అధినేత చంద్రబాబు నాయుడు పర్యటన విజయవంతం చేయాలని కోరారు.

తుమ్మికమానుగూడలో మహిళాశక్తి

కురుపాం : మహిళలకు భవిష్యత్తు కావాలంటే చంద్రబాబునాయుడే ముఖ్యమంత్రి అవ్వాలని టిడిపి సీనియర్ నాయకులు బి.పద్మావతి అన్నారు. సోమవారం మండలంలో ఉరిడి పంచాయతీ తుమ్మికమానుగూడ గ్రామంలో మహిళా శక్తి కార్యక్రమంలో భాగంగా ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఆ గ్రామ మహిళలకు టిడిపి మినీ మేనిఫెస్టోపై అవగాహన కల్పించారు. మాజీ ఎంపిపి జి.రమణమూర్తి, మాజీ సర్పంచులు బి.మంజువాణి, కె.లక్ష్మణరావు, తదితరులు పాల్గొన్నారు.

ర్యాలీ నిర్వహిస్తున్న టిడిపి నాయకులు, మహిళలు

అధికారులతో మాట్లాడుతున్న ఐటిడిఎ పిఒ విష్ణుచరణ్

కొత్త ప్రతిపాదనలు సమర్పించాలి

ప్రజాశక్తి-పార్వతీపురం

గిరిజన ఉప ప్రణాళికలో భాగంగా కొత్త ప్రతిపాదనలు సమర్పించాలని పార్వతీపురం ఐటిడిఎ ప్రాజెక్టు అధికారి సి. విష్ణు చరణ్ అదేశించారు. వివిధ విభాగాల అధికారులతో సోమవారం సాయంత్రం ఐటిడిఎ కార్యాలయంలో పిఒ సమీక్షించారు. ఉప ప్రణాళిక కింద చేపడుతున్న పనుల గూర్చి అడిగి తెలుసుకున్నారు. పనులు వేగవంతం చేయాలని ఆయన సూచించారు. సమావేశంలో ఐటిడిఎ ఎపిఒ సురేష్, ఇఇ జె.శాంతీశ్వర రావు, మత్స్య శాఖ అధికారి వి.తిరుపతయ్య, పిహెచ్ఒ, పిఎఒ తదితరులు పాల్గొన్నారు.

భూదేవికి వినతి అందిస్తున్న గిరిజనులు

అన్యాయంగా పింఛన్లు తొలగించారు

భూదేవి ముందు గిరిజనుల ఆవేదన

ప్రజాశక్తి-సీతంపేట

కొండపోడు భూములు తమ పేరిట ఉన్నాయంటూ పింఛన్లు తొలగించారని కిండంగికి చెందిన వృద్ధులు సవర మసిలమ్మ, సవర కొంజమ్మ, సవర బుడ్డయ్య, సవర మంగమ్మ.. టిడిపి నాయకులు పడాల భూదేవి ఎదుట ఆవేదన వ్యక్తంచేశారు. దీనిపై స్పందించిన భూదేవి అధికారులతో మాట్లాడి మంజూరుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. అవసమైతే మండలంలో ఉన్న బాధితులతో కలిసి నిరసన కార్యక్రమం చేపడతానని చెప్పారు. అర్హులైన పేదలకు అన్యాయం చేస్తే సహించేది లేదన్నారు.

ప్రకృతి సాగు పద్ధతులతో మేలు



అదనపు డిపిఎం ధనంజయరావును సత్కరిస్తున్న జట్టు సభ్యులు

ప్రజాశక్తి - గరుగుబిల్లి

ప్రకృతి వ్యవసాయ పద్ధతులతో రైతులు పంటలు పండిస్తే మేలని ప్రకృతి వ్యవసాయం అదనపు డిపిఎం ఎన్.ధనంజయరావు తెలిపారు. మండల పరిధిలోని తోటపల్లి ప్రకృతి ఆదిదేవోభవ భవన సముదాయంలో సోమవారం గుమ్మలక్ష్మీపురం మండలం వల్లాడ, పెంగవ గ్రామాలకు చెందిన రైతులకు ఒకరోజు శిక్షణను జట్టు వ్యవస్థాపకులు డి.పారినాయుడు అధ్యక్షతన నిర్వహించారు. కార్యక్రమంలో జట్టు ఎగ్జిక్యూటివ్ ట్రస్ట్ ఎస్.ప్రహరాజ్ మాట్లాడుతూ అదనపు డిపిఎం ధనంజయరావు సేవలను కొనియాడారు. శ్రీకాకుళం జిల్లాకు బదిలీపై వెళ్తున్న ధనంజయరావును జట్టు సిబ్బంది ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో మాతోట సభ్యురాలు ఎం.కమలకుమారి, కోఆర్డినేటర్లు జి.మురళీమోహన్, జి.ప్రబోధ్ పాల్గొన్నారు.

గుమ్మలక్ష్మీపురం : జియ్యమ్మవలస మండలంలోని పెద్దబుడ్డిడి గ్రామంలో మాజీ సర్పంచ్ గురాన లక్ష్మి ఆధ్వర్యంలో ప్రకృతి వ్యవసాయ వనరుల విస్తరణపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ప్రకృతి వ్యవసాయం ద్వారా తక్కువ పెట్టుబడితో ఎక్కువ దిగుబడి సాధించవచ్చని యూనిట్ ఇన్‌ఛార్జి సిహెచ్.లక్ష్మణరావు తెలిపారు. పంటల్లో తెగుళ్లు, పురుగుల నివారణకు తీసుకోవలసిన జాగ్రత్తలపై రైతులకు అవగాహన కల్పించారు. వనరుల కేంద్రంలో సహజ సిద్ధమైన కషాయలు. ద్రావణాలు, ఎరువులు అందుబాటులో ఉన్నాయని చెప్పారు. కార్యక్రమంలో రైతులు గురాన శ్రీరామ్మూర్తినాయుడు, చంద్రశేఖర్, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

గిరిజన యువకులకు కలెక్టర్ అభినందన

ప్రజాశక్తి-గుమ్మలక్ష్మీపురం

రాష్ట్ర స్థాయి గిరిజన ఉత్సవాల్లో ఏర్పాటు చేసిన డ్రాయింగ్, పెయింటింగ్ పోటీలలో ప్రతిభ కనబరిచిన గిరిజన యువకులు జిల్లా అధికారుల ప్రశంసలు పొందారు. గుమ్మలక్ష్మీపురం మండలం తాడికొండ గ్రామానికి చెందిన మండంగి బాలచంద్రుడు, ఆరిక సన్యాసిరావు, కురుపాం మండలం దురుబిలికి చెందిన ఆరిక గౌతమ్‌ను కలెక్టర్ నిశాంత్ కుమార్, ఐటిడిఎ పిఒ విష్ణు చరణ్ అభినందించారు. మారుమూల ప్రాంతానికి చెందిన యువకులు రాష్ట్ర స్థాయిలో రాణించడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో డ్రాయింగ్ టీచర్ రుగడ శ్రీనివాసరావు ఉన్నారు.

ప్రతిభ కనబరిచిన యువకులను అభినందిస్తున్న కలెక్టర్ నిశాంత్‌కుమార్

త్వరలో ఎస్‌బిఐ ఎటిఎం సేవలు

పనులను పరిశీలిస్తున్న బ్రాంచి మేనేజర్ కిరణ్‌కుమార్

ప్రజాశక్తి-బలిజిపేట

బలిజిపేట మండల ప్రజలకు అతిత్వరలో ఎస్‌బిఐ ఎటిఎం, సిడిఎం సేవలు అందుబాటులోకి రానున్నాయి. సోమవారం బలిజిపేటలో ఎటిఎం, సిడిఎం యంత్రాల ఏర్పాటు కోసం పనులు ప్రారంభించారు. ఈ పనులను ఎస్‌బిఐ బ్రాంచి మేనేజర్ ఎస్.కిరణ్‌కుమార్ పరిశీలించారు. ఈ నెలాఖరికల్లా ఎటిఎం, సిడిఎం సేవలు అందుబాటులోకి వస్తాయని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థలదాత ధనుంజయ నాయుడు, బ్యాంకు సిబ్బంది ఓంకార్, రమణ, శివ, తదితరులు పాల్గొన్నారు.

హెచ్చరిక బోర్డులు ఏర్పాటు

ప్రజాశక్తి-గుమ్మలక్ష్మీపురం

గుమ్మలక్ష్మీపురం నుంచి కురుపాం ప్రాంతానికి వెళ్లే ప్రధాన రహదారి మలుపుల వద్ద ప్రమాద హెచ్చరిక బోర్డులను ఎల్విన్‌పేట పోలీసులు ఏర్పాటు చేశారు. హెల్మెట్ ధరించండి.. రక్షణ పొందండి, మీ మీద మీ జీవితమే కాదు మీ కుటుంబ సభ్యుల జీవితాలు కూడా ఆధారపడి ఉన్నాయని గుర్తుచేస్తూ బోర్డులు ఏర్పాటు చేశారు. ఎస్ఐ షణ్ముఖరావు మాట్లాడుతూ అతి వేగంతో ప్రయాణించి విలువైన ప్రాణాలను పోగొట్టుకోవద్దని కోరారు. ప్రతి వాహనదారుడు హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలని చెప్పారు. త్రిబుల్ డ్రైవింగ్ చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్ దొర, సిబ్బంది ఉన్నారు.

ప్రమాద హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేస్తున్న పోలీసులు

స్పందనకు 53 వినతులు

వినతులు స్వీకరిస్తున్న ఎపిఒ రోషి రెడ్డి

ప్రజాశక్తి-సీతంపేట

ఐటిడిఎలో ఎపిఒ రోషిరెడ్డి ఆధ్వర్యాన సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమానికి 53 వినతులు వచ్చాయి. కార్యక్రమంలో డిడి శ్రీనివాసరావు, ఇఇ సింహాచలం, డిప్యూటీ డిఎంహెచ్ఒ చిరంజీవి, పిహెచ్ఒ వెంకటేష్, సిడిపిఒ రంగలక్ష్మి, జిసిసి డిఎం సంధ్యారాణి, స్పోర్ట్స్ ఇన్‌ఛార్జి జాకబ్ దయానంద్ తదితరులు పాల్గొన్నారు.